# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వరద బాధితులందరికీ సహాయం అందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు.
- ❖ తెలుగు రాష్ట్రాలలో కురిసిన భారీ వర్షాలు రైల్వే వ్యవస్థను తీవ్రంగా నష్టపరిచాయని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర అనంద్ రావు పాటిల్ తెలిపారు.
- ❖ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బలవర్ధకమైన పోషకాహారం అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్.దినేష్ కుమార్ అన్నారు.
- ❖ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి స్వచ్ఛంద సంస్థలు ఆహార పంపిణీ చేస్తూ ఉదారత చాటుతున్నాయి.
- ❖ రానున్న రెండు రోజుల పాటూ రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==============================

వరద బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలూ చేపడుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు విజయవాడ కలెక్టరేట్ వద్ద ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... కొన్ని చోట్ల ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని ఒక్కో డివిజన్‌కు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించామని.. 32 మంది ఐఏఎస్ అధికారులు సహాయక చర్యల్లో భాగమయ్యారని అన్నారు. రాష్ట్రంలోని 10 జిల్లాల నుంచి ఆహారం సమకూర్చామని.. బాధితులకు మూడు పూటలా అందించాలని అధికారులను ఆదేశించామని స్పష్టం చేశారు. చిట్టచివరి బాధితుడికి కూడా సహాయం అందాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసి విద్యార్థులకు బలవర్ధకమైన పోషకాహారం అందించాలని అల్లూరి సీతారామరాజు  జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. కలెక్టర్ కార్యాలయంలో పాడేరు డివిజన్ పరిధిలోని మండల విద్యాశాఖాధికారులు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులతో మెనూ రూప కల్పన, మధ్యాహ్నం భోజన పథకం అమలు పై ఈరోజు కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఇష్టమైన మెనూను అందించాలని అన్నారు. ప్రాంతాల వారీగా ఉన్న ఆహారపు అలవాట్లు, బియ్యం, పప్పులు, నూనెలు ప్రభుత్వం నిర్దేశించిన విధంగాను, ఆయా ప్రాంతాలలో లభ్యమవుతున్న కూరగాయలు, ఆకు కూరలతో వంటలు తయారు చేయాలని సూచించారు. పిల్లలకు ఇష్టపడే ఆహార పదార్ధాలలో సూక్ష్మ పోషకాలు, ప్రోటీన్లు, క్యాలరీలు సక్రమంగా అందే విధంగా ఆహార పదార్ధాలు ఉండాలని పేర్కొన్నారు. భోజనంలో 900 క్యాలరీలు, 23 గ్రాములు ప్రోటీన్లు ఉండే విధంగా 6 రోజులకు అవసరమైన మెనూ చార్టును సిద్ధం చేయాలని తెలియజేసారు. అదేవిధంగా వారంలో మూడు రోజులు చిక్కీలు, మరో మూడు రోజులు రాగి జావ విద్యార్ధులకు అందించాలని అన్నారు.

==============================

గ్రామ స్థాయిలో శాంతి భద్రతలకు భంగం కలిగించే పాత నేరస్థులు, అనుమానిత వ్యక్తుల కదలికలు, మద్యం, గంజాయి, నాటుసారా క్రయ విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని మహిళ పోలీసులకు శ్రీకాకుళం సబ్ డివిజన్ పోలీస్ అధికారి వివేకానంద్ సూచించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మహేశ్వర రెడ్డి  ఆదేశాల మేరకు ఈరోజు ఉదయం శ్రీకాకుళం పట్టణంలోని మహిళ పోలీసులతో డిఎస్పీ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ... వినాయక చవితి ఉత్సవాలు మండపాలు ఏర్పాటు, నిమజ్జన వివరాలు కమిటీ సభ్యులతో మాట్లాడి.. ఏటువంటి అవాంతరాలు జరగకుండా ప్రశాంతంగా చవితి ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వ్యక్తులు వివరాలను ముందుస్తుగా గుర్తించి సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి, ప్రజలకు, పోలీసులకు మధ్య వారధిగా వ్యవహరించి ప్రజా రక్షణకు, మహిళల భద్రతకు కృషి చేయాలన్నారు.

విరామం

==============================

తెలుగు రాష్ట్రాలలో శని, ఆదివారాలు కురిసిన వర్షాలు విజయవాడ, సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లను అతలాకుతలం చేశాయని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర అనంద్ రావు పాటిల్ అన్నారు. ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాలలో కురిసిన భారీ వర్షాలు రైల్వే వ్యవస్థను తీవ్రంగా నష్టపరిచాయని దీంతో  రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేసిందన్నారు. ఎక్కువగా దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్ తీవ్రంగా ప్రభావితమైందని విజయవాడ - సికింద్రాబాద్ రైలు మార్గంలో ఇంటికన్నె - కేసముద్రం, మహబూబాబాద్ - తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ తీవ్రంగా దెబ్బతిందని అన్నారు. ట్రాక్ పక్కనున్న చెరువుల నుంచి వచ్చిన వరదనీటి కారణంగా రైల్వే ట్రాక్ కొట్టుకుపోవడంతో అక్కడ యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టామన్నారు. విజయవాడ డివిజన్‌లోని రాయనపాడు దగ్గర కూడా ట్రాక్‌పై నీళ్లు ప్రవహిస్తున్నాయని, ట్రాక్ పునరుద్ధరించే పనులు జరుతున్నాయని అన్నారు. చెన్నై వెళ్లాల్సిన కొన్ని రైళ్లను దారి మళ్లించి గుంటూరు మీదుగా నడుపుతున్నామని తెలియజేస్తూ.....

(వాయిస్ 32 సెకన్లు)

విజయవాడలో రైల్వే హెల్ప్ లైన్ నంబర్  75693 05697 ను ఏర్పాటు చేశామని  రైల్వే అధికారులు తెలిపారు.

==============================

విజయవాడ ముంపు బాధితుల సహాయార్థం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి స్వచ్ఛంద సంస్థలు ఉదారత చాటుతున్నాయి. విజయవాడలోని సింగ్ నగర్, పాయకరావుపేట ప్రాంతాల్లోని బాధితులకు కోసం దేవాదాయ శాఖతోపాటు రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ప్రైవేటు సంస్థలు తయారు చేసిన ఒక లక్షా 25 వేల ఆహార పొట్లాలు, తాగునీరు, బిస్కెట్ ప్యాకెట్లు, రొట్టెలను వాహనాల ద్వారా పంపించారు. సహాయక చర్యల్లో భాగంగా సీఐఐ ఆంధ్రప్రదేశ్ 25 వేల వాటర్ బాటిళ్లు, 25 వేల ఆహార పొట్లాలు, బిస్కెట్ ప్యాకెట్లను విరాళంగా అందజేసింది. ఈ వస్తువులను ప్రభావిత ప్రాంతాలకు పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగానికి అందజేశారు. వరద ప్రాంతంలోని బాధితులకు పునరావాస కార్యక్రమాల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా నుండి 53 వేల మందికి ఉదయం భోజనాల నిమిత్తం 20 వాహనాల ద్వారా ఆహారాన్ని సేకరించి పంపించడం జరిగిందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఈరోజు ఒక ప్రకటనలో తెలియజేశారు.

==============================

ఆకాశావాణి విశాఖపట్నం కేంద్రంలోని ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్, క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ పోస్టుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ పోస్టులకు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా క్యాజువల్ బ్రాడ్‌క్యాస్ట్ అసిస్టెంట్ పోస్టుకు రెడియో ప్రొడక్షన్‌లో ఏదైనా డిగ్రీ, లేదా డిప్లమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. ధరఖాస్తులను సిరిపురంలోని ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రానికి పోస్టల్ ద్వారా సెప్టెంబరు 6వ తేదీలోగా పంపించాలని కోరారు.

==============================

రానున్న రెండు రోజుల పాటూ రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 5వ తేదీన పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంను ఆనుకొని మరో అల్పపీడనం ఏర్పడనుందని తెలిపింది. ఋతుపవన ద్రోణి ప్రభావంతో ఉపరితల ఆవర్తనం కోస్తాంధ్ర మీదుగా కొనసాగుతోందని.. దీని ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఓ మోస్తారు వర్షాలు పడతాయని తెలిపింది. కాగా ఈ రెండు జిల్లాలకు ప్రస్తుతం ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని వివరించింది.

==============================

ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 13 వేల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని ఆర్డీవో రవీంద్ర రావు తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో వరద నష్టం జరిగిందన్నారు. మున్నేరు ద్వారా 3 లక్షల క్యూసెక్కుల వరద నీరు కృష్ణా నదిలో కలిసిందని, నందిగామ సబ్ డివిజన్ లో ప్రస్తుతం వరదల కారణంగా రోడ్లకు 140 కోట్ల రూపాయల మేర నష్టం జరిగిందని రవీంద్ర రావు వెల్లడించారు.

==============================
==============================